క్లుప్తంగా

హింస వద్దే వద్దు


శ్రీరాముడు,గాంధీజీ వేషధారణలో విద్యార్థులు

కె.కోటపాడు : విజయదశమి పర్వదినం, గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం సందేశాత్మక ప్రదర్శనను ఇచ్చారు. శ్రీరాముడు, గాంధీజీ వేషధారణలతో హింస వద్దు, **ధర్మమే విజ**యం, సత్యమే శాశ్వతం, అహిం**సే మార్గం అం**టూ ప్రదర్శన ఇచ్చారు.

దేవి ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

మాడుగుల: స్థానిక ఆర్ఎంసీ హైస్కూల్‌లో 1999- 2000 సంవత్సరంలో టెన్త్ చదివిని విద్యార్థులు మంగళవారం దేవి ఆలయ గోపుర నిర్మాణానికి రూ.28 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఎస్.వి.రావు, దేవరాపల్లి శ్రీనివాస రావు, మోటారు యూనియన్ సభ్యులతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా నాటుకోళ్ల విక్రయాలు


సంతలో విక్రయానికి తీసుకువచ్చిన కోళ్లు

మాకవరపాలెం: స్థానిక వారపు సంతలో నాటుకోళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. మంగళవారం జరిగిన వారపు సంతలో విక్రయించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధికంగా తీసుకువచ్చారు. దసరా పండగ సందర్భంగా స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు దారులు రావడంతో నాటుకోళ్లకు గిరాకీ ఏర్పడింది. రూ.500 ధర ఉండే కోడిని రూ.1000 వరకు విక్రయించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 66 మందికి రూ.51.42 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కష్టమొచ్చిన ప్రతి కుటుంబానికి సీఎం సహాయనిధి అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీటీసీ బోళెం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత


ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ నారాయణ

నర్సీపట్నం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రుత్తల గోవింద్ కుటుంబానికి రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును యూనియన్ బ్యాంక్ మేనేజర్ నారాయణ మంగళవారం అందజేశారు. రూపీ ఏటీఎం కార్డు కలిగి, రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. యూనియన్ బ్యాంక్ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకింగ్ పథకాలు, సామాజిక భద్రతా పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సెలర్లు పావని, అప్పలనాయుడు,భవాని పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటా ప్రచారం

దేవరాపల్లి: జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలపై ఇంటింటా ప్రచారం చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహంలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 98 రకాల వస్తువుల ధరలు తగ్గాయని ఆయన చెప్పారు. అనంతరం రైవాడలో ఎరకాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు.


రోలుగుంటలో కలుపుతీస్తున్న మహిళా కూలీలు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

వరిని ఆశిస్తున్న తెగుళ్లు
సస్యరక్షణ పనుల్లో రైతులు నిమగ్నం

రోలుగుంట: వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు, కూలీలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. వరినాట్లు పూర్తయి 25 రోజులు దాటింది. కలుపుతీత పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. మండలంలో సుమారు 1,823 హెక్టార్ల విస్తీర్ణంలో వరినాట్లు వేశారు. అయితే ప్రారంభం నుంచి భిన్న వాతావరణం ఉండడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఒక వారం వర్షాలు అధికంగా కురవగా తరువాత వేసవిని తలపించేలా ఎండలు మండిపోయాయి. దీంతో ఆకుమడులను రక్షించుకునేందుకు అన్నదాతలు తీవ్ర అవస్థలకు గురికావలసి వచ్చింది. ఎట్టకేలకు నాట్లు పూర్తయ్యాయి. అయితే సకాలంలో వర్షాలు, నాట్లు పడకపోవడంతో వరిలో కలుపు అధికమైంది.చీడపీడలుఆశిస్తున్నాయి. దీంతో రైతులు సస్యరక్షణ పనుల్లో బిజీ అయ్యారు. రోలుగుంట, లగుడుకొత్తూరు, కొండపాలెం, బుచ్చింపేట తదితర గ్రామాల్లో కలుపుతీత పనులు జోరుగా సాగుతున్నాయి. రోలుగుంట, కొవ్వూరు, శరభవరం, జానకీరాపురం తరదితర గ్రామాల్లో ఆకుముడత, పొడతెగులు సోకడంతో వ్యవసాయాధికారులు సూచనలతో వాటి నివారణకు రైతులు చర్యలు చేపట్టారు. మండల వ్యవసాయాధి కారి సీహెచ్. చిరంజీవి గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సూచనలు చేస్తున్నారు. పెట్టుబడులు పెరిగిన రీత్యా ఎరవులు, పురుగు మందులను పూర్తి రాయితీతో సరఫరా చేసి, ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పెట్టుబడి పెరిగింది



ఎకరా విస్తీర్ణంలో వరి సాగుచేస్తున్నాను. రూ.15 వేలు పెట్టుబడి అయింది. కూలీ రేట్లు, పెట్టుబడులు పెరిగాయి. కోతదశకు చేరుకుని పంట చేతికి వచ్చేసరికి పెట్టుబడులు మరింత పెరిగే పరిస్థితి ఉంది. రైతులను ఆదుకోవాలి.

– బంటు పరదేశి, రెతు, కొండపాలెం

రాయితీపై ఎరువులివ్వాలి

రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ఇప్పటికి రూ.25 పెట్టుబడి పెట్టాను. ఇందుకోసం అప్పు చేయాల్సి వచ్చింది. ఎరువులు, పురుగు మందులను పూర్తి రాయితీతో సరఫరా చేసి, రైతులను ఆదుకోవాలి.

– మజ్జి నూకరాజు, రైతు, కొంతలం,రోలుగుంట మండలం

సూచనలు పాటించాలి



చీడపీడల నియంత్రణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.ఆకుముడత నివారణకు లీటరు నీటిలో రెండు గ్రాముల ఎసిపేట్ కలిపి ఎకరాకి 400 గ్రాములు, పొడ తెగులుకు లీటరు నీటిలో ఒక ఎం.ఎం. ప్రోపోకొనజోల్ కలిపి ఎకరాకి 200 మిల్లీలీటర్లు వినియోగించాలి.

– సీహెచ్.చిరంజీవి, ఏవో

పీఏసీఎస్ అభివృద్ధికి అందరూ సహకరించాలి


మాట్లాడుతున్న కె.జె.పురం పీఏసీఎస్ పర్సన్ఇన్‌చార్జ్ ఆదిబాబు


రోలుగుంట పీఏసీఎస్‌లో వివరాలు తెలియజేస్తున్న సీఈవో మడ్డు మహేష్

మాడుగుల రూరల్: మండలంలో కేజే పురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)ను లాభాల బాటలో నడిపించడానికి ప్రతి సభ్యుడు సహకరించాలని సంఘం పర్సన్ఇన్‌చార్జ్ శరగడం ఆదిబాబు కోరారు. సంఘ కార్యాలయంలో సీఈవో కాళ్ల ఈశ్వరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. సభ్యుల నుంచి రూ.58లక్షల వసూలు కావలసి ఉందన్నారు. సభ్యులు బకాయిలు చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సంఘం సభ్యుడు కాళ్ల నర్సింగరాజు మాట్లాడుతూ కొత్త భవనంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఆదాయం లభిస్తుందని చెప్పారు. వాయిదా మీరిన రుణ బకాయిలను వసూలు చేయాలని సంఘ మాజీ అధ్యక్షుడు దండి బాబూరావు సూచించారు. సీఈవో కాళ్ల ఈశ్వరావు సంఘ ప్రగతిని వివరించారు. ఈ ఏడాది రూ.7.55 కోట్ల రుణాలను సభ్యులకు ఇచ్చినట్టు చెప్పారు. సంఘానికి చెందిన రెండు స్థలాలను విక్రయించడంతో పాటు ఆప్కాబ్ నుంచి రుణం తీసుకుని సంఘం కార్యాలయానికి పక్కా భవనం నిర్మించేందుకు ఈ సమావేశంలో సభ్యులు ఆమోదించారు. సమావేశంలో సంఘం డైరెక్టర్లు శ్రీనాధు శేఖర్, లెక్కల శ్రీనివాసరావు, మాజీ మార్కెట్టు కమిటీ డైరెక్టరు భీశెట్టి జగ్గప్పారావు, స్థానిక నాయకులు రాపేట జోగినాయుడు, ఆదారి బాబ్జి, ఎం.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు చర్యలు

రోలుగుంట: స్థానిక పీఏసీఎస్ ద్వారా అర్హులైన సభ్యులకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని పర్సన్ ఇన్‌చార్జి సుర్ల బాబులు నాయుడు తెలిపారు. పీఏసీఎస్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. సంఘం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ముందుగా సీఈవో మడ్డు మహేష్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ, జమాఖర్చులను చదివి వినిపించారు. 60 టన్నుల యూరియా, 20 టన్నుల డీఏపీ,పొటాస్ తదితర ఎరువులను రైతులకు ఇచ్చినట్టు చెప్పారు. కొత్తగా రూ.90 లక్షలు రుణాలు అందజేసినట్టు తెలిపారు. పీఏసీఎస్ ఆవరణలో గల ఖాళీ స్థలంలో నాలుగు షాపులు నిర్మించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

చెత్తను తొలగించాలని ఆందోళన


నిరసన తెలుపుతున్న దళితులు, సీపీఎం నాయకులు

రావికమతం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన, హైస్కూల్ ఎదురుగా ఉన్న చెత్తను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ సమీపంలో గల అంబేడ్కర్ కాలనీ వాసులు, సీపీఎం నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. తహసీల్దార్ కార్యాలయం, మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఉన్న చెత్తను తొలగించాలని ఎంపీడీవో,తహసీల్దార్‌లకు పలు మార్లు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని వారు తెలిపారు. చెత్త కారణంగా కాలనీలో 50 కుటుంబాలకు చెందిని 250మంది ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇక్కడ చెత్త వేస్తున్నారని వారు చెప్పారు. దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించకపోతే బీఎన్ రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేస్తామని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చేవ్వేటి సూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గోవిందరావు, స్థానికులు వాలిశెట్టి రాజులమ్మ,బుడతల సత్యవతి తదితరులు తెలిపారు.

విశాఖ డెయిరీ సభ్య రైతులకు దాణా బేసిన్ల పంపిణీ


రైతులకు బేసిన్లు అందజేస్తున్న డెయిరీ డైరెక్టర్ గంగాధర్, సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలో స్థానిక విశాఖ డెయిరీ పాల సొసైటీ సభ్య రైతులకు దాణా బేసిన్లను డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ మంగళవారం అందజేశారు. స్థానిక పాల సొసైటీలో అధ్యక్షుడు దాసరి వెంకటరమణ అధ్యక్షతన బేసిన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సీడీసీ డైరెక్టర్ అన్నం రాము, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు, మండల రైతు విభాగం అధ్యక్షుడు అన్నం రామునాయుడు, పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు అన్నం సాంబమూర్తి, సొసైటీ పాలకవర్గ సభ్యులు గెంజి రామారావు, పడిదెడకల రామునాయుడు, పెంటకోట అప్పలనాయుడు, కోట్ని సత్యారావు, కొప్పాక దేముళ్లు, గొరపల్లి కృష్ణారావు, శనివాడ రాజు, విడుదల సత్యారావు, కొమర బాబురావు, డెయిరీ క్లస్టర్ సూపర్‌వైజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు


కల్వర్టుపై పడిన రంధ్రం

మాడుగుల రూరల్: భారీవాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మండలంలో కేజే పురం శాలిపేట వద్ద గల కల్వర్టు దెబ్బతింది. రెండు చోట్ల రంధ్రాలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు, ద్విచక్రవాహనదార్లు ఇబ్బందులకు గురవుతున్నారు. విజయరామరాజుపేటలో బొడ్డేరు నది వద్ద డైవర్షన్ రోడ్డు వర్షాల కారణంగా గత నెల 16వ తేదీన కొట్టుకుపోవడంతో అల్లూరు జిల్లా పాడేరు, జోలాపుట్‌తో పాటు మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, ప్రైవేటు వాహనాలు, భారీ వాహనాలు కేజే పురం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీని వల్ల గ్రామంలో గాంధీ బొమ్మ సెంటరులో ఉన్న కల్వర్టుపై రంధ్రాలు పడి, ప్రమాదాలు జరుగుతున్నాయి.

డిజిటల్ బుక్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసా


డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నర్సీపట్నం మున్సిపాలిటీ నాయకులు


మాడుగులలో డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాజారామ్


బైలపూడిలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎక్కడ ఎటువంటి అన్యాయం జరిగినా వెంటనే డిజిటల్ బుక్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేస్తే పార్టీ **అండగా ఉంటుంద**ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడ**పాటి సుబ్బలక్ష్మి,** మున్సిపాలిటీ పార్టీ టౌన్ **అధ్యక్షులు ఏకా** శివ తెలిపారు. మున్సిపాలిటీ **నాయకులు మంగళ**వారం డిజిటల్ బుక్ క్యూర్‌ఆర్ **కోడ్‌ను ఆవిష్కరిం**చారు. ఈ సందర్భంగా వారు **మాట్లాడుతూ పార్టీ** శ్రేణులకు జరిగిన అన్యాయా**నికి న్యాయబద్ధ**మైన సమాధానం రాబోయే **రోజుల్లో ఇవ్వనున్న**ట్లు చెప్పారు. పార్టీ శ్రేణులకు **ఎవరికి ఎక్కడ అ**న్యాయం జరిగినా సులువుగా **సమాచారం తెలు**సుకునేందుకు పార్టీ అధినేత **వైఎస్.జగన్‌మోహన్**రెడ్డి డిజిటల్ బుక్ విధానం **తెచ్చారన్నారు. ఈ** కార్యక్రమంలో కౌన్సిలర్ జగదీ**శ్వరి, నియోజకవర్గ** యూత్ అధ్యక్షులు తమరాన **శ్రీను, విద్యార్థి విభా**గం నియోజకవర్గ నాయకులు **కిల్లాడ శ్రీనివాసరా**వు, నాయకులు పెట్ల అప్పలనా**యుడు, సుర్ల**నాయుడు,వరలక్ష్మి తదితరులు **పాల్గొన్నారు.**

మాడుగుల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఇబ్బందులొస్తే డిజిటల్‌బుక్‌లో నమోదు చేయాలని ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. సోమవారం మాడుగులలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డిజిటల్ బుక్, క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరిగినా, ఇతర సమస్యలున్నా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శానాపతి కొండలరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఉన్నీషా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎడ్ల హేమంత్ కుమార్, రాఖీ శ్రీను, పెరుమళ్ళవెంకటరావు, తంటపురెడ్డి బన్నీ, పుట్టా మురళీ కృష్ణ, కాత, వెంకట రమణ, శ్రీనాదు జగ్గారావు, కోట్యాడ భాస్కరరావు కరణం రాము, కాళింగ కళ్యాణ రాజు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసిన, దాడులు చేసిన వారి వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు,ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచనలు మేరకు సోమవారం మండలంలోని బైలపూడిలో వారు డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు,కార్యకర్తలు లక్ష్యంగా కేసులు పెడుతోందని చెప్పారు. వీటన్నింటకీ చట్టబద్ధంగా బదులు తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు,వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు,సర్పంచ్‌లు చుక్కా అప్పలనాయుడు, కోన అర్జున, సలాది గంగశేషు, బి.రమాదేవి, వంటాకు నరసింహమూర్తి, నేతలు పి.టి.బాబు, ఈర్లె చైతన్య, లాలం శివకుమార్, ఆర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షం వరి పంటకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

2న జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 2వ తేదీ గురువారం అప్పలరాజుపురంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తెలిపారు. దేవిమెట్ట మీద వెలసిన లలితాదేవి ఆలయంలో దసరా సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

దుర్గాదేవి... నమోస్తుతే


మహాదుర్గాదేవిగా అమ్మవారు


వంటర్లపాలెంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


దొండపూడి హైస్కూల్ కాలనీలో..


వెంకన్నపాలెంలో ..


ఎం. కోడూరు శివాలయంలో పార్వతీదేవికి పూజలు చేస్తున్న భక్తులు


విజయరామరాజుపేటలో అమ్మవారికి సమర్పించేందుకు తీసుకువెళ్తున్న 50 కిలోల లడ్డు


మాకవరపాలెంలో దీపారాధనలో పాల్గొన్న భక్తులు


గొలుగొండలో నిర్వహించిన అన్నసమారాధన


సంజీవరావును సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు


వడ్డాదిలో దుర్గాదేవి అలంకరణలో భ్రమరాంబిక దేవి


బలిఘట్టంలో బోనాలు ఊరేగిస్తున్న మహిళా భక్తులు

నర్సీపట్నం: నియోజకవర్గంలో శరన్నవరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.నర్సీపట్నంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు తొమ్మిదవ రోజు మహాదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

భవాని భక్తుల బోనాల ఊరేగింపు

మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం గాంధీబొమ్మ సెంటర్‌లో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భవానీ భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. దుర్గాదేవి మండపం వద్ద నుంచి 250 మంది భక్తులు బోనాలను బలిఘట్టం వీధుల్లో ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు.

చోడవరం: స్థానిక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కనకదుర్గమ్మగా అలంకరించారు. ఆలయంతో పాటు మెయిన్‌రోడ్డు పొడవునా భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. వెంకన్నపాలెం కొండపై గల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. పూలదండలు,గాజుల దండలతో అమ్మవారిని అలంకరించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయంలో ఉపాలయంలో వేంచేసియున్న గౌరీదేవిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. దుర్గాదేవి అమ్మవారిని బంగారం, ముత్యాల ఆభరణాలతో అలంకరించారు.

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో భ్రమరాంబిక దేవిని దుర్గాదేవిగా అలంకరించారు. సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వర అమ్మవారి తిరువీధి ఉత్సవం మంగళవారం తెల్లవారుజాము వరకు సాగింది. పలువు రు భక్తులు అగ్నిగుండం తొక్కి అమ్మవారిపై భక్తిని చాటుకున్నారు. మండల కేంద్రం బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, లోపూడి, నీలకంఠాపురం, గొర్లెపాలెం తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లో దుర్గాష్టమి పూజలు చేశారు. విజయరామరాజుపేటలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దుర్గమ్మకు 50 కిలోల లడ్డూను అమ్మవారికి సమర్పించారు.

గొలుగొండ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కనకదుర్గ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు అన్నసమారాధన నిర్వహించారు.

మాడుగుల రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావును ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరామ పరమేశ్వరావు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బారావు తదతరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాఖీ శ్రీను తదితరులుపాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంటర్లపాలెంలో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఎం. కోడూరు శివాలయంలో పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టలక్ష్మికి కుంకమ పూజలు చేశారు.

మాడుగుల: శరన్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దేవి తల్లి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తు లు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బొమ్మలు కొలువు ఆకట్టుకుంది.

రావికమతం: దొండపూడి హైస్కూలు కాలనీలో దుర్గాదేవికి భవానీ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. రావికమతం, కొత్తకోట, మేడివాడ, టి.అర్జాపురం, చిలకవానిపాలెం,చినపాచిలి, గుమ్మాళ్లపాడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

మాకవరపాలెం: మండలంలోని తామరం, మాకవరపాలెం, జంగాలపల్లి, గిడుతూరు, జి.కోడూరు, తూటిపాల తదితర గ్రామాల్లో మంగళవారం దుర్గాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. తామరంలో చిన్నారులకు నృత్య పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని దుర్గామల్లేశ్వర ఆలయం వద్ద మహిళలు దీపారాధన చేశారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం, పాయకరావుపేట : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644

Office mail : sakshiadvtvsp@gmail.com